
# నువ్వూ నేనూ మనం

## డా॥ మానేపల్లి

దివాకర్‌కి తల దిమ్మెక్కి పోయింది. ఇది ఊహించని పరిణామం. అయితే అందులో విషయాలు అతనికి అందనివి కావు. కాని ఉద్దేశపూర్వకం కాకపోయినా - ఏదో అలా జరిగిపోయింది. కాస్త నిదానించి ఆలోచించి వుంటే - ఆ సంగతులన్నీ తనకి తెలిసి వుండేవే. ఏదో ఒక తొందరపాటు - ఉన్మాదమా, కండకావరమా, బహుశా కాకపోవచ్చు, కాని ఎవరయినా అలా అనుకునే అవకాశం లేకపోలేదు. ఉషారాణి పట్ల తన మనసులో చెలరేగుతున్న తరంగాల తాకిడికి తనలో విచక్షణ లేకుండా పోయింది. పిచ్చి అనుకోవాలా?

దివాకర్ ఎం.బి.ఏ ఫస్ట్‌క్లాసులో పాస య్యాడు. కొద్దినెలలు ఒక ప్రయివేటు మెడికల్ ఏజన్సీలో సేల్స్‌మేనేజర్‌గా చేశాడు. తరువాత ప్రస్తుతం పనిచేస్తున్న కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ అయ్యాడు. పదివేల జీతం. టూర్ చేస్తే ప్రత్యేకంగా టిఏ డిఏ డ్యూటీ ఎలవెన్స్. ఉద్యోగం బాగానే వుంది. వయస్సు ఇరవై ఎనిమిదేళ్ళు తల్లిదండ్రులు పెళ్ళికి తొందర చేస్తున్నారు. ఇద్దరు అక్కలకి పెళ్ళయింది. పిల్లా పాపలతో హాయిగా సంసారం చేసుకొంటు న్నారు. చెల్లెలికి కూడా మొన్న వైశాఖమాసంలో పెళ్లయి బరంపూర్ వెళ్ళిపోయింది. తనకీ ఇక పెళ్ళి చేసుకుంటే మంచిదనే వుంది. ఆ సమయంలో ఉషారాణి కలిసింది. తను ఆఫీసు ఎదురుగానే ఎల్ఐసీ ఆఫీసు. అందులో ఆమె స్టెనోకమ్ పర్సనల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నది. ఆరువేల జీతం. వయసు ఇరవైఆరు. డిగ్రీ పూర్తిచేసి ఈ ఉద్యోగంలో చేరింది. ఉషారాణి తండ్రి రిటైర్డ్ పోస్ట్‌మాస్టరు. ముగ్గురు కొడుకుల తరువాత కడసారి కూతురు. స్వంత ఇల్లు, పెన్షన్ తప్ప పెద్ద ఆస్తిపాస్తులేం లేవు. అదనంగా పడమరపక్క గదీ, వసారా దించి అద్దెకిచ్చారు. ఆ అద్దె ఒక ఎనిమిది వందలు వస్తుంది.

ఉషారాణి మొదటినుంచీ చాలా స్వతంత్రంగా పెరిగింది. ఇంటర్మీడియట్‌లోనే మహిళా




సంఘాల్లో పని ప్రారంభించింది. డిగ్రీ పూర్తిచేసే సరికి స్త్రీవాద భావజాలం బాగా తల కెక్కింది. పురుషాధిక్య భావజాలం పట్ల అంతా యింతా కసి కాదు. వల్లమాలిన ద్వేషం.

ఆడదాని అందాన్ని అంగాంగ విన్యాసంతో సవివరంగా వర్ణిస్తే - ఉషకి వళ్లుమంట, పరమ అసహ్యం. ఆ వర్ణన వెనక ఉన్నది - మోహం, మదం అని ఆమె నమ్మకం. ఆ విధంగా వర్ణించడం వెనక శరీర వ్యామోహం ఉంటుందనీ, అది చాలా అనారోగ్యకరమైన లక్షణం అనీ ఆమె భావిస్తుంది.

ఉష అందంగానే వుంటుంది. ఐతే కన్ను చెదరగొట్టే అందం మాత్రం కాదు. ఎర్రని మేనిచాయ కాదామె. ఎరుపుకి దగ్గరగా వుండే చామనచాయ. సూదిగా ముక్కు, తీక్షణమైన చూపులు. విశాలమైన ఫాలం. చాలా బిరుసయిన ఉంగరాలజుట్టు. జడకు లొంగదు. రెండు జడలు వేస్తుంటుంది. ఆధునిక దుస్తులు ధరించదు. చీర జాకెట్టు లేదా లంగా వోణీ. కుదురుగా గుండ్రని బొట్టు. ఎత్తు మడమల జోడు వేసుకోదు. సహజంగానే పొడగరి. 5 అడుగుల 5 1/2 అంగుళాలు. ఆడవాళ్ళలో అది బాగా ఎత్తుకింద లెక్క. చేతులకి గాజులు వేసుకోదు. ఎడమచేతికి వాచీ. అది ఆడపిల్లల వాచీ కాదు. మామూలు వాచీ. కాళ్లకి కూడా మగవాళ్లు వేసుకునే మామూలు ఆకు జోళ్ళే వేసుకుంటుంది.


అందంగా వున్న ఆడపిల్లల్నే ప్రేమిస్తారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా అందంగా లేకపోతే? పొట్టిగా నల్లగా ఉంటే? ప్రేమ పుట్టదా? శరీర ఆకర్షణ ఒక్కటే ముఖ్యమా ?

డిగ్రీ పూర్తిచేశాక కొంతకాలం టెలిఫోన్ బూత్‌లో పనిచేసింది. పని ఉన్నా లేకున్నా పోకిరీ వెధవలు అక్కడికి చేరేవాళ్ళు. ఆమెకి అది చాలా కంటకింపుగా చిరాగ్గా వుండేది. కొంతకాలం భరించింది. కొందర్ని దవడ వాయగొడతాను జాగ్రత్త అని వార్నింగు ఇచ్చి హడలగొట్టింది. ఉష - అంటే ఫైర్‌బ్రాండ్, అగ్గిబరాటా అని పేరు తెచ్చుకుంది.

దివాకర్ మృదుస్వభావి. ఉషని చూసి ఇష్టపడ్డాడు. పరిచయం పెరిగింది. ఒకసారి ఇద్దరూ సరదాగా కలిసి సినిమా చూశారు. ఒకటిరెండు సార్లు కేంటీన్‌లో టీ తాగారు. దివాకర్ కాస్త చొరవ తీసుకున్నాడు. ఇక ఆగలేక - ఒక విధమైన వెర్రితనంతో ప్రేమలేఖ వ్రాసాడు. ఆమె అందాన్ని వర్ణించాడు, ఆడవాళ్ళ కళ్ళు మగవాళ్ల కళ్లకంటే విశాలంగా ఉంటాయనడం నిజం కాదు - అది ఊహాజనితమైన వర్ణన. ఊరికే పొగడ్డం వుత్తి కల్పన తప్ప వాస్తవం కాదు. ఆ రకమైన వర్ణన వస్తువ్యామోహంలో, శరీరవాంఛలో భాగం. అది ఉషకి ఇష్టం వుండదు. అందంగా వుండే ఆడపిల్లల్ని చూసి ఎవరయినా ప్రేమిస్తారు. అసలు ప్రేమ అనేదే తప్పుడు భావన. మనసు పెద్ద అబద్ధం. మనసులు కలవడం, మనసు ఇచ్చి పుచ్చుకోవడం - ఇవన్నీ ఊహలు, భ్రమలు. రక్త లక్షణం ఒక్కటే నిజం. శరీరం ఒక్కటే నిజం. ఇవన్నీ బాగా అర్థం చేసుకొంది ఉష.

వయసు వేడిలో ఒకరిపై ఒకరు ఇష్టాన్ని పెంచుకోవడం - కోరికలు ఉరకలు వెయ్యడం - దాన్నే ప్రేమ అనుకోవడం - పైగా ఆ ప్రేమ పవిత్రం అనుకోవడం - వ్యామోహంతో కలవడం, తరువాత ఒకర్నొకరు మోసం చేసుకోవడం ఆడపిల్ల మోస పోవడం,గర్భం రావడం, కొందరు ధైర్యంగా అబార్షన్ చేయించుకొని మర్చిపోయి బ్రతకడం, కొందరు

ఎదిరించడం, కొందరు నిరాశతో పిరికితనంతో ఆత్మహత్య చేసుకోవడం, కొందరు పెళ్ళి తరువాత - అక్రమ సంబంధాలు, భర్తని లేక భార్యని విడిచిపెట్టి ఇష్టం వచ్చిన వ్యక్తితో లేచిపోవడం, తరవాత ఆ పొంగు తగ్గాక మళ్లీ వదిలేసి రావడం ఇవన్నీ - ప్రేమ కాదు. అసలు ఇదంతా వ్యక్తిగత ఆస్తి - స్వంత ఆస్తి భావనలో భాగం అని ఉష నేర్చుకుంది. అర్థం చేసుకుంది. మార్క్సిజం ఎంతో కొంత అధ్యయనం చేసిన తరువాతనే ఆమె స్త్రీవాదం అర్థమయింది. నవ్య పరిచయంతో ఆమె బాగా మారిపోయింది. వివాహ వ్యవస్థ పట్ల నమ్మకం పోయింది.




తన జవాబులో ఇదే రాసింది ఉష.

దివాకర్‌కి ఇదొక ఎదురుదెబ్బకింద లెక్క. ఆ రకం సమాధానం వస్తుందని అతను ఊహించ లేదు. అయితే దివాకర్ ఆమె రాసిన సంగతులు బొత్తిగా తెలియనివి కావు. దివాకర్ కూడా అందగాడు. చదువుకొన్నవాడు. ఏ ఆడపిల్ల అయినా కోరుకోదగినవాడు. అభ్యుదయ భావాలు గలవాడు. కోటేశ్వరుడు కాదుగాని - దేనికీ లోటు లేదు.

ఆ తరువాత ఉష కలిసినపుడు చనువుగా పలకరించడానికి ఎందుకో జంకాడు దివాకర్.

"ఏంటి దివాకర్ - అలా దివాలా తీసినట్టు మొహం పెట్టావేంటి?" అని తనే చనువు తీసుకుని పలకరించింది ఉష.

ఇద్దరూ కాంటీన్‌కివెళ్ళారు. రెండు బ్రూకాఫీ ఆర్డరిచ్చింది.

చిన్న బిస్కట్ ప్యాకెట్ తీసి విప్పింది. రెండు బిస్కెట్లు దివాకర్ చేతిలో పెట్టింది. కాఫీ చిక్కగా వేడిగా పొగలు కక్కుతోంది. బిస్కట్టు విరిచి కాఫీలో ముంచి మునిపంట సుతారంగా కొరుకుతూ చిరునవ్వులు చిందించింది. దివాకర్ యాంత్రికంగా బిస్కెట్లు పట్టుకుని కూచున్నాడు.

"ఏంటీ - మాట్లాడవూ - నా ఉత్తరం చదివి హర్ట్ అయ్యావా? కోపం తెచ్చుకున్నావా? అలా బిగిసిపోయావేంటీ? ఆ - నిన్నే "

"ఏం లేదు. ఏం కోపం లేదు -"

"మరి - ఇటు చూడు - ఆడపిల్లలా బుర్ర దించుకున్నావేంటి?"

"ఆ - అదేం లేదు"

"ఇదుగో - నేను చూడు - ఫ్రాంక్‌గా తల ఎత్తి కళ్లల్లోకి చూస్తూ మాట్లాడుతున్నాను - నువ్వేమో పాతకాలపు ఆడపిల్లలా తల దించుకున్నావు.

"సారీ ఉషా రియల్లీ సారీ"

"దేనికీ - సారీ ఏంటీ - సరే - కాఫీ తాగు నీకిష్టమేగా - బిస్కట్లు ముంచుకొని కాఫీ తాగు - "

"సారీ అన్నాను కదా "

"దేనికి సారీ - నేను అందంగా ఉన్నానా? కళ్ళు ముక్కు పెదవులు ఇంకా ఏవేవీ ఎలా ఉన్నాయి వర్ణించావు కదా - బాగున్నాడా? ఏం చేస్తావూ తినేస్తావా? నేను ఊరుకుంటే నన్ను తినేస్తావా? ఆ కాఫీలాగ తాగేస్తావా? చెప్పు దివాకర్.

బిస్కట్లు తుంచి కాఫీలో ముంచి నోట్లో పెట్టుకొన్నాడు.

"చెప్పు దివాకర్"

"అబ్బ - వదిలెయ్ ఉషా - సారీ అన్నాను కదా"

"ఏంటి వదిలేదీ నిన్ను వదిలేది లేదు - చెప్పు నీ ఉద్దేశం ఏంటి అసలు - ఒకవేళ నేను అందంగా లేననుకో - లేదా - రేపు ఏదో జబ్బు మొహం నిండా స్ఫోటకం మచ్చలు పడిపోయి - జుట్టంతా ఊడిపోయి - బుగ్గలు లాగేసి - కళ్ళు లోతుకు పోయి-"

"ఉషా - ప్లీజ్ - ఇంక ఊరుకో"

ఉష నవ్వేసింది. ఇద్దరూ లేచారు.

"రేపు సాయంత్రం సినిమాకి వెళ్దామా?"

"ఎందుకూ -"

"ఇవ్వాళ నాకు కొంచెం పనుంది గనుక. వస్తావా రేపు - సినిమాకి"

"ఏం సినిమా?"

"ఏదో ఒక సినిమా - ఏం యింట్లో దెబ్బలాడతారా?"

"ఛ - అదేం లేదు - ఓహ్ - తెలిసింది నీ ఫేవరేట్ హీరో - అందుకనా?"

"ఏయ్ - నీ ఫేవరేట్ హీరోయిన్ వుంది కదా -"

"సరే చెబుతానులే -"

ఇద్దరూ ఎవరి ఆఫీసుకు వాళ్ళు వెళ్ళి పోయారు. మర్నాడు సినిమాకి వెళ్ళారు. సినిమా చూసింది తక్కువ. కబుర్లు ఎక్కువ. చుట్టుపక్కల వాళ్ళు విసుక్కున్నారు - ఇంటర్వెల్ తరువాత - వేరే దూరంగా ఒక మూలకి పోయి కూచున్నారు. ఉష తన ఫ్రెండ్ సరళ కథ చెప్పింది. చాలా అందంగా ఉంటుంది. ఇంటర్ కాలేజిమేట్ కల్చరల్ మీట్‌లో ఒక నాటికలో నటించింది. ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది. ఎవడో సినిమావాడు చూసి ఆమెని ఒక ప్రొడ్యూసర్‌కి పరిచయం చేశాడు. ప్రొడ్యూసరూ, పక్కనే ఉన్న డైరెక్టర్, తరువాత వచ్చిన హీరో - అంతా ఆ అమ్మాయిని చూసి ఆ అందాన్ని చూసి వెర్రెత్తిపోయారట. సినిమాలో ఛాన్స్ ఇస్తామన్నారట. సెకండ్ హీరోయిన్. ఒకడే హీరో. పెద్ద విగ్గు, లిప్‌స్టిక్, పెద్ద పెద్ద స్పాంజి బ్రాసియర్స్, తొడల మీదవరకూ మిడ్డీలు చూసింది - ప్రతివాడూ ఏదో వంకన చెయ్యి వేసేవాడే - పది లక్షలిస్తా మన్నారట - రానందట పోనీ పాతిక లక్షలిస్తా మన్నారట - నాకు వద్దందట - చాలా ఇండి పెండెంట్ పెర్సన్ - ఇద్దరు హీరోయిన్ల కాన్సెప్ట్ అస్సలు పనికి రాదందట - ఆమె కథ చెప్పింది. సరళ ఇప్పుడు లిటరేచర్‌లో పీజీ చేస్తున్నదట.

విన్నాడు దివాకర్

"ఆమె గురించి నా దగ్గరెందుకు చెప్పావ్?" అన్నాడు, కాస్త సీరియస్‌గా "అంటే ఆమె చేసిన పని నీకు నచ్చిందన్నమాటే కదా - అంటే రేపు నువ్వయినా ఆమే కరక్టంటావు కదా" అన్నాడు.

"అవును - ఏం ఆమెది తప్పా?"

"అసలు ఏం అనుకుంటున్నారు ఆడాళ్లంటే"

"ఇండిపెండెంట్ పర్సన్ - ఒరిజినల్ థింకింగ్"

"అంటే - అలాగే వుండాలా? బోల్డుమంది ఎగిరి గంతేస్తారు !"

"అసలు ఆడాళ్లంటే ఎవరు?" అని లేచింది ఉష.

"ష్ - నెమ్మది - చుట్టూ అంతా మనల్నే చూస్తున్నారు - అంటూ - అటు చూడు - సినిమా చూడమ్మా ముందు-"

సినిమా చూసి వస్తూ దారిలో మళ్ళీ అదే గొడవ

"ఆడవాళ్ళు పుట్టరు దివాకర్ - ఈ పురుష ప్రపంచం వాళ్లనలా తయారుచేస్తుంది - డబ్బు సినీగ్లామర్ - పాపులారిటీ, సెలెబ్రిటీ క్రేజ్ - ఫారిన్ టూర్ - ఫ్రీ లవ్ - డ్రింక్స్ - ఇలా వాళ్లని రకరకాల

ప్రలోభాల్లో పెడతారు - నీచంగా ఆడాళ్లంతా ఆ పొట్టిడ్రస్సులూ లిప్‌స్టిక్‌లూ రాసుకుని తిరుగుతా రంటావా? ఈ ప్రొడ్యూసర్లు అమ్మాయిని కొనేస్తారు. సంపాదించిన బ్లాక్‌మనీతో వాళ్ళని లొంగదీసు కుంటారు - ఫ్రీ లవ్ అంటే విచ్చలవిడితనం అనుకుంటారు.

ఇంటి మలుపు దగ్గరికొచ్చారు.

"నీదంతా ఒక ప్రపంచం - నీలా ఎవ్వరూ ఉండరు" అన్నాడు దివాకర్.

"ఉండరనే నేను చెప్పేదీను - ఎవరి ఇమేజ్, ఐడియాలజీ వారికుండాలి. నలుగురితో నారాయణ అంటే నాకిష్టం వుండదు. అంతమాత్రాన మనం ఎవరితోనూ విరోధం తెచ్చుకోం. మనకొక స్వతంత్ర ఆలోచన వ్యక్తిత్వం వుండాలి. వెన్నెముక లేని మనుషులంటే నాకు అసహ్యం"

దివాకర్‌కి ఈ మాటలు బాగా అర్థ మయ్యాయి. తన ప్రవర్తనలో, ఆలోచనలో మాట తీరులో రావలసిన మార్పు గురించి అర్థం చేసుకున్నాడు. ప్రేమపట్ల అతనికి లోగడ వున్న అభిప్రాయాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. పెళ్ళి అంటే ఎలా ఉండాలో కూడా ఒక నికరమైన అభిప్రాయం ఏర్పరచుకున్నాడు.

ఒకరోజు సాయంత్రం ఆఫీసు పని అయ్యాక బీచ్‌కి వెళ్ళారు. మిగతా వాళ్ళతో కలవకుండా దూరంగా కూచున్నారు. రెండు పొట్లాలు వేరుశనగ పలుకులు కొనుక్కొని - ఒక్కొక్కటీ నోట్లో వేసుకుంటూ కబుర్లలో పడ్డారు.

"పెళ్లి - పాతివ్రత్యం - శీలం - పెళ్లంటే నూరేళ్ల పంట - పుణ్యం కొద్దీపురుషుడు - దానం కొద్దీ బిడ్డలు - ఈ రకం మాటలంటే నా కస్సలు పడదు. టాల్‌స్టాయ్ అన్నాడో ఎవరన్నాడో గుర్తులేదు - జీవితాంతం ఒకే మనిషిని ప్రేమించడం అంటే - రాత్రంతా ఒకే కొవ్వొత్తి వెలగాలనుకోవడం లాంటిదట. కరక్టు దివాకర్"

"అంటే ఎంతమందినయినా ప్రేమించొచ్చా"

"అలా కాదు - ఒక మనిషి ఎంతకాలం ప్రేమ, ఇష్టం వుంటే అంతకాలం వుండొచ్చు. అదంతా పోయాక కావాలనుకుంటే విడిపోయే స్వతంత్రం, పరిస్థితిని బట్టి ఇంకోవ్యక్తి జతకట్టగల స్వతంత్రం కూడా ఎవరికయినా వుండాలి. ఒకర్ని విడిచి మరొక రితో వుండాలనుకోవడం అవినీతి అనుకోకూడదు."

"అదేంటి ఉషా - అలా అయితే ఈ వివాహ వ్యవస్థకే అర్థం వుండదు"

"ప్రస్తుతం అమలులో వున్న ఈ వివాహ వ్యవస్థకు అర్థం లేదనే నేనన్నదీను".

ఇద్దరూ లేచి కాంటీన్ వేపు వెళ్ళారు. దీపావళి దగ్గర పడుతోంది. వాతావరణంలో చలి ప్రారంభమైనట్టుంది. దివాకర్ ఉష భుజాలచుట్టూ చేతులు వేసి దగ్గరికి పొదివి పట్టుకున్నాడు.

ఉషకూడా దివాకర్‌కి మరింత దగ్గరగా జరిగి అతని నడుం చుట్టూ చెయ్యి బిగించింది. ఇద్దరూ పరస్పర స్పర్శసుఖం అనుభవిస్తున్నారు. ప్రేమకు శారీరక కలయిక పరాకాష్ఠా లేక ఒక మెట్టా-

అది ఒక మెట్టు అంటుంది ఉష

మరి శృంగారం ?

బహుశా పరాకాష్ఠ కావచ్చు.

కాంటీన్‌లో జనం పల్చగా ఉన్నారు. దూరంగా ఒక పెద్ద ఓడలో దీపాలు వెలిగాయి. ఒక స్టీమరు పెద్దగా కూత వేసి ముందుకు కదిలింది. డాల్ఫిన్స్ నోస్ కొండమీద నైట్ హౌస్ దూర తీరాల మీద కాంతులు వెదజల్లుతూ క్రమబద్ధంగా గిరగిరా తిరుగుతుంది.

టీ - సాసర్‌లో పోసుకుని కొంచెం కొంచెం రుచి చూస్తూ తాగుతున్నారు.

ఆ దగ్గర్లో ఎవరో సిగరెట్టు ముట్టించి పొగ వదిలాడు.

ఉష చికాకు పడింది, అక్కణ్ణించి లేచి దూరంగా వేరే చోట కూర్చున్నారు.

దివాకర్ లేచాడు. బాగా చీకటి పడింది. బీచ్‌లోజనం పల్చబడ్డారు. చుట్టూ జనం లేకపోవడం చూసి - కేంటిన్ పక్క పిట్టగోడ దగ్గర - ఉషని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమయింది నీకు?" అన్నది ఉష లోపల లోపల నవ్వుతూ. కళ్లల్లోంచి నవ్వు చిమ్ము తున్నది. ఆమె కూడా చాలా సంతోషించిందనీ, ఆమోదించిం దనీ అర్థమవుతూనే వుంది.

వాళ్ల మధ్య ఇదే మొదటి ముద్దు.

లోగడ ఒకసారి ముద్దు పెట్టుకోబోతే కుదరనిచ్చింది కాదు. దాదాపు మూడు నెలల క్రితం నాటిమాట. అప్పటికీ ఇప్పటికీ ఇద్దరు ఒకరికొకరు దగ్గరయ్యారు.

అదోలా చాలా యిష్టంగా చూస్తున్నాడు.

"ఏమిటలా చూస్తున్నావు. కొంపముంచి తినేస్తావా ఏమిటి నన్ను -" అన్నది ఉష చిలిపిగా.

"ఒక్కసారే తినేస్తే రేపటికి వుండవు. కొంచెం కొంచెం కొరుక్కు తింటాను సరేనా"

"ఏమిటీ కొంచెం కొంచెం కొరుక్కు తింటావా? ఎలా కనిపిస్తున్నాను నీకు"

"చెప్పనా? పాలకోవాలాగ - గులాబ్‌జామ్ లాగ"

"ఏయ్ - ఇలా అయితే ఈసారి నీతో రాను - రాను రాను పోకిరీగా తయారవుతున్నావు - ఏమో అనుకున్నాను నువ్వూ రసికత్వం వెలగబోస్తున్నావు" అన్నది చిరుకోపం నటిస్తూ -

"నోరు ఊరిపోతుంది ఉషా"

"నోరు ఊరిపోతూందే? వ్యవహారం చాలా దూరం వచ్చిందే - ఇక ఫుల్‌స్టాప్ పెట్టకపోతే నువ్వు ఇంకా ఎడ్వాన్సు అయిపోయేలా ఉన్నావు సుమా -"

ఆటోలో యింటికి బయలుదేరారు. ఆటోలో మళ్లీ ఇంకోసారి ముద్దుపెట్టుకున్నాడు - ఈసారి ఇంకా గాఢంగా.



రాజ్యోత్సవాల సందర్భంగా ఢిల్లీ ఎ.పి.భవన్‌లో త్యాగ బ్రహ్మ గానసభవారు ఏర్పాటు చేసిన లలితగీతాల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన చి॥ కందుకూరి పూజితకి రాష్ట్ర నీటిపారుదల శాఖామాత్యులు గౌ॥శ్రీ పొన్నాల లక్ష్మయ్య, వెనుక కమీషనర్ శ్రీ సి. విశ్వనాథ్‌గార్లు ఉన్నారు.

"ఏయ్ – నిన్ను చూస్తుంటే నాకేదో భయం భయంగా వుంది. కొంపముంచి ఐ లవ్ యూ అంటావా– పెళ్లిగాని చేసుకుంటానంటావా?"

"నోనో " అన్నాడు బాగా దగ్గరికి లాక్కుంటూ

దివాకర్ కంపెనీ పనిమీద రాజమండ్రి, బెజవాడ గుడివాడ టూర్ వెళ్ళాడు పదిరోజులు.

సురేష్ – దివాకర్ క్లాస్‌మేట్స్. సురేష్‌కి ఒక ఏడాది క్రితం పెళ్లయింది. అతని భార్య పుట్టింటికి వెళ్ళింది. భార్య దగ్గరికి ప్రతి శని ఆదివారం వెళ్తుంటాడు. ఆమె విజయనగరంలో వుంటున్నది. సురేష్ రామ్‌నగర్‌లో ఒక చిన్న యిల్లు కొన్నాడు. ఎపార్ట్‌మెంట్ కాదు. ఇండిపెండెంట్ హౌస్. రెండు మూడు లక్షలు పెట్టి రీ మోడల్ చేయించాడు. బ్యాంక్‌లోన్ తీసుకుని డబుల్ బెడ్‌రూం హాలు, వేరే డైనింగ్‌హాలు, కిచెన్. ఇంటిముందు రెండు కొబ్బరిచెట్లున్నాయి. ఇంటివెనక కాస్త స్థలం వుంటే సురేష్‌భార్య పూల మొక్కలు వేసింది. మల్లి, కనకాంబరం, నందివర్ధనం, మందార – కన్నుల పండుగలా పూలచెట్లు. ఇలా చాలా సౌకర్యంగా ముద్దుగా వుంది.

శని ఆదివారాల్లో సురేష్ విజయనగరం వెళ్తుంటే – తాళం అడిగి పుచ్చుకున్నాడు దివాకర్. ఇల్లు చూసి ఎగిరి గంతేసి కేరింతలు కొట్టింది ఉషారాణి.

"రాణీ – ఎప్పటికయినా మనం ఇటువంటి ఇల్లు కొనుక్కోవాలి"

"మనమా – కావాలంటే నువ్వుకొనుక్కో – మళ్ళీ మనం ఏమిటీ?"

"అదే మనకి"

"ఏయ్ – నోర్ముయ్" అని బుగ్గమీద మెత్తని దెబ్బ వేసింది – యిష్టంగా, ప్రేమగా

"ఏం తప్పా ? అయితే గోడకుర్చీ వెయ్యనా, గుంజిళ్ళు తియ్యనా – చెప్పు రాణి – రాణీగారి ఆజ్ఞ జవదాటకూడదు" అని గుంజిళ్ళు మొదలు పెట్టాడు. రెండు గుంజిళ్ళు తీసేసరికి దగ్గరికొచ్చి కావలించుకుని ముద్దు పెట్టుకుంది.

"ఎన్ని గుంజిళ్ళయినా తియ్యడానికి నేను సిద్ధం"

"నేను మాత్రం సిద్ధంగా లేను"

శనివారం, ఆదివారం రెండు రోజులూ కలిసే ఉన్నారు.

ఆదివారం సినిమాకి వెళ్ళారు. దివాకర్‌కి చాలా కంగారుగా, భయంగా, ఆనందంగా, థ్రిల్లింగ్‌గా– ఏదో ఏదోలా వుంది. పెళ్ళి వద్దంటుంది.మళ్ళీ ఇదంతా ఎంతో ఇష్టంగానే చేస్తోంది – అంటే ఏమిటి? పెళ్ళికి ముందే ఇదంతా?! అర్థం కాలేదు. చాలా తికమక పడ్డాడు. కాగా ఆమె తనకి సహకరించడంలో ఆహ్వానించడంలో గల ఆంతర్యాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. ఇదంతా నిజమేనా? ఈ రెండురోజుల సౌఖ్యం నిజంగా నిజమేనా అని ఊరికే తర్కించుకున్నాడు. ఎదురు చూడని సంఘటన!

ఉషకి జ్వరం వచ్చి మూడు రోజులు సెలవు పెట్టింది. ఆ తరువాత సెకండ్ సాటర్‌డే, సండే – మొత్తం అయిదురోజులూ ఆఫీసుకు వెళ్ళలేదు. దివాకర్ కాలుగాలిన పిల్లిలా తిరిగాడు. ఇంటికిరావడం, మాటికి చీటికి ఫోన్లుచెయ్యడం లేదు. మొదటినుంచీ ఆ పద్ధతి లేదు. ఉష దగ్గిర సెల్ లేదు. ఇంట్లో తనకి స్వతంత్ర్యం ఉన్నమాట నిజమేగాని – అలా అని బొత్తిగా పద్ధతి లేకుండా వుండకూడదు గదా – దేనికయినా సెల్ఫ్ డిసిప్లిన్ – క్రమశిక్షణ ఉండాలి.

సోమవారం లంచ్ అవర్‌లో కలిశాడు. జ్వరం వల్ల కొద్ది నీరసంగా కనిపించింది.

"చక్కనమ్మ చిక్కిన అందమే – నీరసంగా ఉన్నా అందంగా ఉన్నావు ఉషా"

"మాటలు నేర్చావు – బాగా రుచి మరిగి"

బాగా రుచి మరగటం అంటే ఏమిటి?

"ఛీపో – అన్ని పోకిరీ పన్నులూ –పోకిరీ మాటలూను"

నవంబర్ నెల చివరి రోజులు – చలి కాలం వచ్చింది. పగలంతాఎండ– దీపాలు పెట్టేసరికి సుఖంగా వెచ్చగా చలి –

"ఎవరో పెళ్ళి సంబంధానికి వచ్చారు " అన్నది ఒకరోజు.

"నీకా పెళ్ళి సంబంధమా"

"ఏం రాకూడదా"

"వస్తే చేసుకుంటావా?"

"నచ్చితే చేసినా చేసుకోవచ్చు"

"మరి నీ మాట"

"నీకేం నువ్వు బాగానే వున్నావుగా"

"ఏమిటీ? బాగానే అంటే నువ్వు లేకుండా నేను ఏ నాడయినా నేను బాగుంటానా? నా మనసు నీకు మాత్రం తెలీదా ఈ అయిదారురోజులు కనపడకపోతేనే ప్రాణం తల్లడిల్లిపోయింది."

"ఏం ఆ మధ్య పదిరోజులు టూరు వేశావుగా – దాని మాటేమిటి?"

"ఉద్యోగధర్మం – కంపెనీవాళ్ళు పనిమీద పంపించారు"

"పదిరోజులు దూరంగా చూడకుండా ఉన్నావుగా"

"ఉన్నాన్లే కాని – నిన్ను తల్చుకోని రోజు లేదు"

"తల్చుకుని ఏం చేస్తావు – అంతా చిన్న పిల్లాడిలా మాట్లాడకు"

"అవునుచిన్న పిల్లాడినే– చిన్న పిల్లలు పెద్దవాళ్లని వదిలి వుండలేరు – బెంగ పెట్టుకోరూ"

"నా గురించి బెంగా? దేనికీ"

ఈ సంభాషణ ఇలా సాగుతూనే ఉంది. బాక్స్‌లో అన్నీ ఖాళీ చేసి తన సీటులోకి వెళ్ళిపోయింది ఉష.

డిసెంబర్ వచ్చింది. క్రిస్టమస్ వచ్చింది. ఎల్ఐసీ బ్రాంచి ఆఫీసు డివిజినల్ మేనేజర్ పాల్‌రాజు – క్రిస్టమస్‌కు పెద్దపార్టీ ఇచ్చాడు. పాల్‌రాజు తమ్ముడు శామ్యూల్‌రాజు దివాకర్‌కి కాలేజీలో సీనియర్,మంచి ఫ్రెండ్. పార్టీకి దివాకర్ కూడా వచ్చాడు, పార్టీ చాల ఘనంగా జరిగింది. పార్టీ తరవాత క్రైస్తవ పద్ధతిలో ప్రార్థనలూ, క్రైస్తవ భక్తిగీతాలూ–


"పరిశుద్ధ పరిశుద్ధ పరిశుద్ధ ప్రభువా"

ఆ పాటంటే దివాకర్‌కి ఇష్టం.

రాత్రి పది దాటింది. బ్రాందీ, విస్కీ, బీర్ – నలుగురితో పాటూ దివాకర్ కూచున్నాడు.

"ఇలాంటి పన్లు కూడా మొదలెట్టావా" అని కన్నెర్ర చేసింది ఉష. "అదేం లేదు ఏదో అకేషన్ వచ్చింది – ఫ్రెండ్స్ కలిశారు గదాని" అని నీళ్ళు నమిలాడు దివాకర్. "నేనేమన్నా తాగుబోతునను కున్నావా ఏమిటి?" అన్నాడు. "ఎలాగో చావు మళ్ళీ నా దగ్గరికొచ్చావంటే చూస్కో – బాగుండదు" అన్నది. "దగ్గరికి రాను – లోపలికి వస్తాను. తిన్నగా నీ లోపలికి ప్రవేశిస్తాను" అన్నాడు. "ఛీపో" అన్నది ఉష ప్రేమగా.

చివరికి ఇద్దరూ ఒక ఒప్పందానికి వచ్చారు.



"నీ పెళ్ళాంలాగ ఇంట్లో వంట చేసుకుంటూ, నీకు బిడ్డల్ని కని పెంచుతూ - వుండలేను. నా వల్ల కాదు, నా ఉద్యోగం నాదే. నీ ఉద్యోగం నీదే. బిడ్డలయినా సంసారమయినా సమాన ప్రాతిపదిక మీదనే సాగాలి. ఏ విషయంలోనైనా ఇద్దరికీ సమాన హక్కులు ఎందరు పిల్లలూ ఎలాగ పెంచాలి. ఇల్లు ఏర్పరుచుకోవడం అన్నీ ఉమ్మడి ఒప్పందంతోనే జరగాలి - వింటున్నావా?"

"అలాగే - నీ ఇష్టం - నీ మాట ఏదీ కాదనను - కాని నన్ను ప్రతిసారీ కంట్రోలు చెయ్యకూడదు" అన్నాడు దివాకర్.

"నన్ను కంట్రోలు చెయ్యకుండా వుండు ముందు. మాటకి ముందు నా పెళ్ళాం నా పెళ్ళాం అంటూ ఎగేసుకొచ్చావో - కత్తిరించేస్తాను జాగ్రత్త" అన్నది ఉష, సీరియస్‌గా.

బుగ్గ గిల్లి "అలాగే మేడమ్" అన్నాడు దివాకర్.

"ఈ వేషాలేం పనికి రావు. నాకు ఏనాడు యిష్టం పోతే ఆనాడు గుడ్‌బై చెప్పేస్తాను - ఆ తరువాత ఏడ్చుకుని లాభం లేదు - ముందే చెబుతున్నాను" అన్నది.

జనవరినెలలో సంక్రాంతి పండగ వెళ్లాక అమావాస్యనాడుపెళ్ళి - అని నిర్ణయం అయింది. శుభలేఖలు కాదు -కరపత్రాలు అచ్చువేశారు. హేతువాద సంఘం తరుపున జయగోపాల్,ఇంకా లవణం గారు, మహిళా సంఘం తరుపున కృష్ణవేణి గారు, విప్లవ రచయితల సంఘం తరుపున వర ప్రసాద్, వర్మ, శేషయ్య, వేద హక్కుల సంఘం తరపున లాయర్ బాలకృష్ణ, శ్రీరామ్మూర్తి, రమణ, ఇంకా నవ్య, అన్నపూర్ణ, ఝాన్సీ అంతా పెళ్ళికి వచ్చారు. భోజనాలు కాదు - టిఫిన్ టీ - లేదా కూల్‌డ్రింక్ - ఉపన్యాసాలు - దండల మార్పిడి లేదు - వరప్రసాద్ గారొచ్చి ఇద్దరిచేతా ప్రతిజ్ఞలు చేయించారు.

బయటికి వస్తూ రమణ "ఇదీ పెళ్ళంటే - నాకు నచ్చింది" అన్నాడు.

దివాకర్, ఉషారాణి - "నువ్వూ నేనూ మన ఇద్దరం" అన్నారు.

పక్కనే ఉన్న అప్పలరాజు హుషారుగా ఈలవేస్తూ "రైట్ రైట్-ఇది బాగుంది - నువ్వూ నేను మనం-చాలా బాగుంది ఈ మాట" అన్నాడు. అరుణ కుమార్ అందుకుని - "ఈ పేరుతో సినిమా తీస్తే చాలా బాగుంటుంది" అన్నాడు. "ఇదే తీయ్-" అంది అన్నపూర్ణ "మరి వీళ్ళే యాక్టర్లా-?" అంది ఝాన్సీ.

"అయితే మనం ఎవ్వరం బాలా - ఏ సత్యజిత్‌రాయో దిగి రావలసిందే" అన్నది అన్నపూర్ణ.

"దేశం ఏం గొడ్డుపోలేదు" అన్నాడు సురేష్. సురేష్‌కి ఈ మధ్య కూతురు పుట్టింది. ఆ సంతోషంలో ఉన్నాడు.

"ఇకముందు మన ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఎవరు పెళ్ళి చేసుకున్నా ఇలాగే చేసుకోవాలి" అన్నాడు అరుణకుమార్.

"యంత్రమెట్టా నడుస్తు వుందంటే -" అని పాట అందుకున్నాడు అప్పలరాజు. వాతావరణం చాలా కోలాహలంగా వుంది.

"ఈసారి కనక పెళ్ళి చేసుకోవాలంటే తప్ప కుండా ఇలాగే చేసుకుంటాను నేను" అన్నాడు రమణ.

"నీకు పెళ్లయి పోయింది గదరా - మళ్ళీ పెళ్ళన్నావంటే నిన్ను చంపేసి అన్నల్లో కలిసిపోతాను రోయ్ " అన్నాడు అరుణకుమార్.

దివాకర్, ఉష - చుక్కల్లో చుక్కల్లా చిరు నవ్వులు చిందిస్తున్నారు. రేపుదయం ట్రయిన్‌మీద అరకు ప్రయాణం.

మేమూ వస్తున్నాం అన్నాడు భార్య చెయ్యి పట్టుకుని రమణ.

"మీరెందుకురా మధ్యలో"

"పోనీ వెళ్లనియ్యరా- పెళ్లయి మూడేళ్లయినా వెళ్లలేదుగా"

"అందుకే హనీమూన్ వెళ్తున్నాం" అన్నాడు. భార్య అతనివేపు ఎర్రగా చూస్తుంది. హాలంతా నవ్వుల్లో ఈలల్లో నిండిపోయింది.

# అక్షీణ తేజస్సులు

విసురుగా
గలగలా పొర్లిపోతున్న క్షణాలు
కాగితం మీద
అడుగులో అడుగేసుకుంటూ
కదిలిపోయే అక్షరాలను చూసి
నవ్వుకున్నాయి.
అంతేకాదు
అవి లోలోనే అహంకరించాయి
తమవేమో పరుగులని
అక్షరాలవి సత్తాలేని నత్తనడకలని.
అంతటితో ఆగలేదవి.
పొగరు తలకెక్కిన ఆ క్షణాలనుకున్నాయి
తాము కాలజనయిత్రి కడుపారా కన్నబిడ్డలమని.
పాపం వాటికి తెలియదు
అక్షరాలు
కాలాన్నే జయించిన కలాల్లో ఉదయించిన
అనశ్వర కాంతిబింబాలని.
పొద్దు రెక్కలు వాలిపోతున్నాయి.
ఉరకలెత్తే క్షణాల కాళ్లు అలిసిపోతున్నాయి.
కాగితం మీద కదలాడే
అక్షరాల ఉరవడి
క్రమక్రమంగా పెరిగిపోతున్నది.
సృష్టికి పరిణామం అనివార్యం కదా.
ఆ పూటతో క్షణాలు
కాలం పొరల్లో కనుమరుగైపోయాయి.
కటిక చీకట్లు లోకాలను కబళించినా
అక్షరాలు మాత్రం
కాలం పుటల అంచుల మీద
అస్తమయమెరుగని అక్షీణ తేజస్సులై
మిగిలిపోయాయి.

- డా॥ సి. నారాయణరెడ్డి